పలువురికి మండలి చైర్మన్ పరామర్శ

మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

చిట్యాల, డిసెంబర్ 15 : శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రైవేటు సెక్రటరీ చిట్యాలకు చెందిన ఏనుగు నర్సింహారెడ్డి తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం జరిగిన ఆమె దశదిన కర్మ కార్యక్రమంలో గుత్తా పాల్గొని లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తన చిన్ననాటి మిత్రుడు శీలా రాజయ్య అనారోగ్యానికి గురి కావడంతో గుత్తా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. గుత్తా వెంట నర్రా మోహన్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, మారగోని ఆంజనేయులు ఉన్నారు.

యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

యాదవ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్15 : యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ డివిజన్ యాదవ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని యాదవులు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ గౌరవాధ్యక్షుడు చింతలచెరువు లింగయ్య, అధ్యక్షుడు ఎర్రయ్యయాదవ్, సైదులుయాదవ్, ఉగ్గిడి జానయ్య, శ్రీకాంత్, చేగొండి అచ్చయ్య, చిలకల మురళి, చందు, నాగరాజు, సురేశ్, పుట్టిబోయిన ప్రవీణ్, దారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతాంగ పోరాటాలను అణిచివేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీపీఎం రాష్ట్ర నాయకుడు సుధాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, డిసెంబర్ 15 : రైతాంగ పోరాటాలను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబించిన కేంద్రంపై రైతులు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఉద్యమం చేట్టారన్నారు. అప్పుడు రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని, వాటి అమలు కోసం ఉద్యమిస్తున్న వారిని అణిచివేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. మద్దతు ధరల చట్టం అమలు చేయాలని, ఉపాధిహామి పథకం పని దినాలను పెంచి దినసరి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, నాయకులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి, పతాని శ్రీను, జూకూరి నాగయ్య, అయితగాని విష్ణు, గడగోజు వెంకటాచారి, ఊరుగొండ శ్రీను పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

నల్లగొండ సిటీ, డిసెంబరు 15 : పట్టణంలోని సంజీవని మెడికేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని నాగార్జునకాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, ఘగర్, థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికులకు బీపీ, ఘగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు పుల్లారావు, వరుణ్ కుమార్, సోంబాబు, సృజన, మల్లికార్జున్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

మునుగోడు, డిసెంబర్ 15 : మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కల్వకుంట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, కల్వకుంట్ల నుంచి వెల్మకన్నె వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, వేంకటేశ్వర్లగూడెం వరకు విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయాలని, బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో వసతులు కల్పించాలని అనేక మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా వసతులు కల్పించక పోతే గ్రామస్తులను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, సీపీఎం మండల నాయకుడు వరికుప్పుల ముత్యాలు, గ్రామ కార్యదర్శి పగిళ్ల మధు, నాయకులు అయితగోని యాదయ్య, బొందు పెద్ద అంజయ్య, నారగోని సైదులు, పగిళ్ల యాదయ్య, సింగపంగ లింగయ్య పాల్గొన్నారు.

గణేశ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

గణేశ్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు,డిసెంబర్15 : ఏఐఎస్ఎఫ్ మండల మాజీ అధ్యక్షుడు దివంగత ఈదులకంటి గణేశ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండలంలోని ఎల్గలగూడెంలో గణేశ్ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సురిగి చలపతి, ఈదుల కంటి కైలాశ్, గోపగోని ఉదయ్, కె.వెంకన్న, దాం వెంకన్న, కట్కూరి లింగస్వామి, గోపగోని సైదులు, బొంగు రాములు, ఈదుల కంటి స్వామి పాల్గొన్నారు.

'కొంపెల్లి పెద్ద చెరువుకు నీరందేలా చర్యలు'

మునుగోడు, డిసెంబర్ 15 : మునుగోడు మండలం కొంపెల్లి పెద్ద చెరువుకు నీరు అందించే కాల్వ పూడి పోయిందని, కాల్వలో పూడిక తీసి, చెరువుకు నీరందేలా చర్యలు తీసుకుంటామని వెదిరె పూలమ్మ ఫౌండేషన్ చెర్మన్ వెదిరె మేఘారెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామ ఆలయ చైర్మన్ వెదిరె విజయేందర్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపాక గ్రామ శివారు నుంచి సుమారు 5కిలోమీటర్ల కాల్వ మరమ్మతు పనులను ఫౌండేషన్ తరపున చేయిస్తామన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, బోయపర్తి లింగయ్య, భాజ మనోజ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ దవాఖాన

- పెచ్చులూడుతున్న చండూరు ఆస్పత్రి పైకప్పు, గోడలు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- ఆస్పత్రికి వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు

చండూరు ప్రభుత్వ ఆస్పత్రి భవనం

చండూరు, డిసెంబర్ 15 : చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖాన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోడలు, పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. వర్షం వస్తే చాలు నీరంతా లోపలికి చేరుతున్నది. విద్యుత్ వైరింగ్ సరిగా లేక తరచూ తీగలు వేలాడుతున్నాయి. అడుగు భాగం కుంగిపోయి గుంతల మయంగా మారింది. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో తెలియక సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులు భయాందోళనకు గురవుతున్నారు.

ఊరికి దూరంగా..

ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం ఊరికి దూరంగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది, రోగులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తనిఖీకి వచ్చిన సందర్భాల్లో ఆస్పత్రి పట్టణానికి దూరంగా ఉందని, చీకటి పడితే పాముల బెడద ఎక్కువగా ఉంటుందని సిబ్బంది అనేక మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. వైద్యం కోసం ఈ ఆస్పత్రికి ప్రతి రోజు 70 నుంచి 80 మంది రోగులు వస్తుంటారు. ఆస్పత్రి పరిసరాలు కూడా అపరిశుభ్రంగా ఉండడంతో విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. రాత్రి వేళల్లో వైద్యంకోసం రావలంటే ప్రజలు భయపడుతున్నారు. ఆస్పత్రి సరిగా లేని కారణంగా ప్రైవేట్ దవాఖానకు పోవాల్సివస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు గతంలోనే నిధులు

గత కేసీఆర్ ప్రభుత్వం ఆస్పత్రి మరమ్మతుల కోసం రూ.68 లక్షలు మంజూరు చేసింది. అయినా ఆస్పత్రికి మరమ్మతులు చేయక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలి మీద పడుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వైద్యం కోసం వచ్చిన రోగులను సైతం గదుల్లో కాకుండా వరండాలోనే కూర్చో బెట్టి వైద్యం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించాలని లేదా కొత్త భవనాన్ని నిర్మించాలని వైద్య సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

పెచ్చులూడుతున్న ఆస్పత్రి పైకప్పు

త్వరలోనే కొత్త భవన నిర్మాణం

- మండల వైద్యాధికారి రాజు

ఆస్పత్రి మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ.68లక్షలు మంజూరు చేసింది. కానీ భవనాన్ని పరిశీలించిన జిల్లాస్థాయి ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు భవనం పూర్తిగా దెబ్బతిన్నదని తేల్చారు. దాంతో కొత్త భవన నిర్మానానికి రూ.1.44 కోట్లు మంజూరయ్యాయి. స్థల సేకరణ జరుగుతున్నది. త్వరలోనే భవన నిర్మాణం పనులు ప్రారంభిస్తాం.

బెల్ట్ టెస్ట్ విజేతలతో నిర్వాహకులు, శిక్షకులు

కరాటే పోటీల్లో నకిరేకల్ విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్, డిసెంబర్ 15 : జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బెల్ట్ టెస్ట్‌లో నకిరేకల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో అంజి మాస్టర్ జపాన్ బ్లాక్ బెల్ట్ అంతర్జాతీయ సర్టిఫికెట్, మెంబర్‌షిప్ సాధించాడు. శ్రీమ నవ్వి షాటోకాన్ బ్లాక్ బెల్ట్ పస్ట్ డాన్, శివ సాయి, విగ్నేశ్, సాయి జపాన్ బ్రౌన్, కలర్ బెల్ట్ విభాగంలో రేవంత్, కృపాల్, సాకేత్, విగ్నేశ్, ప్రభాస్ ప్రతిభ కనబర్చారు. విజేతలకు రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, కందాల ప్రమీల, ప్రకాశ్‌రావు, కృష్ణ సర్టిఫికెట్లు అందించారు. విజేతలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జేకేఏఐ జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి సోములు, ట్రైనర్ విజయ్‌కుమార్, అంజి, శ్రీనివాసచారి, సత్యరాజు పాల్గొన్నారు.

శాలిగౌరారం కేజీబీవీ ఎస్ఓ బదిలీ

శాలిగౌరారం, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాల ఎస్ఓ ఉమాదేవిని పెద్దఅడిశర్లపల్లికి బదిలీ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రవళికను శాలిగౌరారం కేజీబీవీకి బదిలీ చేశారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు నివాళి

నాయుడు పాలెం గ్రామంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

హాలియా, డిసెంబర్ 15 : దేశ మాజీ ఉప ప్రధాని దివంగత సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఆదివారం అనుముల మండలం నాయుడు పాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు మందా సైదులురావుగౌతమ్ మాట్లాడుతూ తొలి ఉప ప్రధాన మంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన జీవతం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున్‌రావు, రాంబాబు, విశ్వేశ్వర్ రావు, తిరపతయ్య, నర్సింహ, శ్రీనివాస్ రావు, కళ్యాణ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు అన్నదానం

గ్రూప్-2 అభ్యర్థులకు అన్నదానం చేస్తున్న దాతలు

మిర్యాలగూడ టౌన్, డిసెంబర్15: ఫాతిమా ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ పర్వేజ్ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో గ్రూప్-2 పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని తెలంగాణ ఆటోమోటార్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహ్మద్ నాజర్ అలీ ప్రారంభించి మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు మధ్యాహ్న వేళల్లో ఇబ్బందులు పడకుండా భోజన వసతి కల్పించడం గొప్ప విషయమన్నారు. దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాజు, గోపాలకృష్ణ, వినోద్, జావేద్, జహంగీర్ లాల్, మహ్మద్ హుస్సేన్ ఆరిఫ్, ఆటోడ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా లచ్చీరాం

లచ్చీరాం

రామగిరి, డిసెంబర్ 15: రాష్ట్ర కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన ఉదావత్ లచ్చీరాంను నియమించారు. ఆదివారం అతడికి సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జి.స్థితప్రజ్ఞ, కె.శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా లచ్చీరాం మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత పెన్షన్ కోసం కృషి చేస్తానన్నారు.

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి

నకిరేకల్, డిసెంబర్ 15 : విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మంగళపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాల చిన్నమల్లయ్య(60) మేకలను కాసేందుకు వాటిని తొలుకొని గ్రామ శివారులోకి వెళ్లాడు. కాటమయ్య సమీపంలో మేకలు మేస్తున్న క్రమంలో సింగిల్ బుడ్డి ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు తగిలింది. గమనించిన మల్లయ్య మేకలను రక్షించే క్రమంలో వాటిని పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

నకిరేకల్, డిసెంబర్ 15 : కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం నకిరేకల్ పట్టణ శివారులోని చందంపల్లి వద్ద 65 జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన శిరస్సు వెంకన్న(51) బైక్‌పై నకిరేకల్ వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా చందంపల్లి వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో వెంకన్నకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పూల మ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

విష్ణువర్ధన్‌నాయక్

హాలియా, డిసెంబర్ 15 : తిరుమలగిరి సాగర్ మండలం శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌నాయక్ (17) రెండు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీశ్ రెడ్డి తెలిపారు. విష్ణువర్ధన్‌నాయక్ హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. తల్లిదండ్రులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడికి వినికిడి సమస్య ఉండడంతో మిషన్ పెట్టుకొని ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు 8712670 194 నంబర్‌కు తెలుపాలని ఆయన కోరారు.

రూ.1.15 కోట్లతో కల్లేపల్లి ఆలయ పునఃనిర్మాణం

దామరచర్ల, డిసెంబర్ 15: మండలంలోని కల్లేపల్లి బంగారు మైసమ్మ ఆలయాన్ని రూ.1.15 కోట్లతో పునఃనిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దస్రూనాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బంజారుల ఆరాధ్యదైవమైన మైసమ్మ ఆలయాన్ని ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పా రు. ఆలయ నిర్మాణానికి నిధులు సరిపోక పోతే ప్రజాప్రతినిధులు, బంజారా ఉన్నతాధికారులు, నాయకుల నుంచి సేకరిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు ఉన్నారు.

శివ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

శివ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

దామరచర్ల, డిసెంబర్ 15 : ఈ నెల 12న వేములపల్లి మండలంలోని నాగార్జున సాగర్ ఎడమ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న లావూరి శివ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం పరామర్శించారు. శివ మృతదేహం శనివారం పొనుగోడు వద్ద లభించగా.. ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం అతడి స్వగ్రామమైన దామరచర్ల మండలం బొల్లిగుట్టతండాకు తరలించారు. విషయం తెలుసుకున్న భాస్కర్‌రావు ఆదివారం తండాకు వెళ్లి శివ తండ్రి లావూరి బాషాతో పాటుగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, ఆంగోతు హతీరాంనాయక్, కె. వీరకోటిరెడ్డి, జానకిరాములు, పొన్నానాయక్, రాందాస్ ఉన్నారు.

కుర్ర విష్ణు ఆశయ సాధనకు కృషి చేయాలి

మిర్యాలగూడ, డిసెంబర్ 15: మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దివంగత కుర్ర విష్ణు ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం విష్ణు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని విష్ణు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట 30వ వార్డు కౌన్సిలర్ కుర్ర చైతన్య, బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు సిద్ధార్థ, నల్లమోతు చైతన్య, వింజం శ్రీధర్, నల్లమోతు సాంబశివరావు, తిరంశెట్టి కోటేశ్వర్ రావు ఉన్నారు.

మాజీ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న మాజీ సర్పంచులు

మర్రిగూడ, డిసెంబర్ 15 : మండలానికి చెందిన 2013లో ఎన్నికైన మాజీ సర్పంచులు ఆదివారం నారాయణపురం మండలంలోని సరళ మైసమ్మ ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరి కొకరు శాలువాతో సన్మానించి మెమెంటోను అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, మాజీ సర్పంచులు అయిలీ లక్ష్మీనర్సింహ, మెగావత్ లాలూనాయక్, మాస శేఖర్, ఎడ్ల శ్రీరాములు, దేశిడి సురేందర్‌రెడ్డి, గంట కృష్ణ, పాక నగేశ్, మునగాల అంతిరెడ్డి, ఉడుగు అంజయ్య, కంచుకట్ల సంపత్, నరేందర్‌రెడ్డి, పాముల యాదయ్య, కృష్ణమాచారి పాల్గొన్నారు.

ఎనుగుల వంశీయుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న ఎనుగుల వంశీయులు

నార్కట్‌పల్లి, డిసెంబర్ 15 : మండలంలోని పెరుమాండ్ల బావి గ్రామానికి చెందిన ఎనుగుల వంశీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వంశ పెద్దలు ఎనుగుల అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 150 సంవత్సవాలకు పూర్వం ఏర్పడిన ఎనుగుల వంశస్తులు 102 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో రోడ్లు, హనుమాన్ దేవాలయ అభివృద్ధికి సహకారం అందించాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

నేటి నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి, జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబర్15 : సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను సోమవారం నుంచి జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం ఆర్డీఓ అశోక్‌రెడ్డి, జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ నర్సిరెడ్డి మాట్లాడుతూ పోటీలు సోమవారం 10.30 గంటలకు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు ఉదయం 9.30 గంటల వరకు స్టేడియానికి రావాలని సూచించారు. ఈ నెల 21 వరకు జరిగే క్రీడోత్సవాల్లో 20 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 5వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన శిక్షణ అధ్యాపకులు

భూదాన్ పోచంపల్లి సందర్శనకు వెళ్లే వారితో ఎంజీయూ వీసీ, రిజిస్ట్రార్

రామగిరి, డిసెంబర్ 15: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రీసెర్చ్ మెథడాలజీ కోర్సు శిక్షణ పొందుతున్న అధ్యాపకులు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లిలో గల టైక్స్‌టైల్స్ పార్క్‌ను సందర్శించారు.

అక్కడి కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు వారిని తీసుకెళ్లినట్లు ఎంజీయూ అధ్యాపకులు తెలిపారు. వారిని వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి అభినందించారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా రవీందర్

రవీందర్

చిట్యాల, డిసెంబర్ 15 : చిట్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా తాళ్లవెల్లెంల మాజీ సర్పంచ్ జనగాం రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండలంలోని గాదిరెడ్డిపల్లెలో జరిగిన క్లబ్ సభ్యుల సమావేశంలో కోశాధికారిగా రేగులగడ్డ నర్సింహ, కోశాధికారిగా కొల్లోజు శ్రీకాంత్, క్లబ్ బాధ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ రేపాల మదన్‌మోహన్ మాట్లాడుతూ చిట్యాల క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించి జిల్లాలోనే ఉత్తమ క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో నల్లగొండ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ హరినాథ్, క్యాబినెట్ ట్రెజరర్ మురళీధర్ రెడ్డి, జోన్ చైర్మన్ రామకృష్ణ చిలుకూరి,

పొన్నం లక్ష్మ య్య, పాటి మాధవరెడ్డి, పందిరి శ్రీనివాసులు, రంగా వెంకటేశ్వర్లు, మేడిశెట్టి శ్రవన్‌కుమార్, వన పర్తి వెంకటేశ్వర్లు, పి.కరుణాకర్, కోనేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

తిరుమలగిరి, డిస